
సాక్షి
ఒడిశా
బుధవారం । 15 । నవంబర్ । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 4,43,026
బంగారం	300 మిల్లీ గ్రాములు
వెండి	3 గ్రాముల 800 మిల్లీ గ్రాములు


– భువనేశ్వర్/పూరీ



'మెట్రో'కు గ్రీన్‌సిగ్నల్

భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మొత్తం 12 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది.

- 8లో



ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

రాయగడ జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కర్లకొన ఘాటీ వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలయ్యాయి..

- 8లో

న్యూస్‌రీల్

ఘనంగా కాళీమాత పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న గొమాంగో

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో కాళీమాత పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గొమాంగో మంగళవారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పూజా కమిటీ వారితో సమావేశమై మాట్లాడారు.

ఘనంగా పరబ్ వేడుకలు



పరబ్ జ్యోతితో కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా గిరిజన, క్రీడా సాంస్కృతిక సంబరం.. పరబ్ వేడుకలు ఘనంగా జరిగాయి. కొరాపుట్ పురపాలక సంఘ స్థాయి వేడుకలను మంగళవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మ అమ్మవారి దేవాలయం వద్ద జ్యోతిని వెలిగించారు. క్రీడాకారులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్వయం సహాయక బృంద మహిళలు ర్యాలీ చేశారు. జిల్లా ప్రణాళిక సంఘం అధ్యక్షుడు, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పాడాల్, కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటిందు రంజన్ శెఠిలు బహుమతులు అందజేశారు.


లాప్రోస్కోపీ సేవలు ప్రారంభం



లాప్రోస్కోపీ విభాగాన్ని ప్రారంభిస్తున్న బేగ్ దంపతులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలోని ఉత్కళ అలూమిన కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆస్పత్రిలో రోగులకు మరిన్ని సేవలు అందించేందుకు కర్మాగారం సన్నాహాలు చేసింది. దీనిలో భాగంగా ఉచితంగా లాప్రోస్కోపీ సేవలు ప్రారంభించింది. మంగళవారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కర్మాగారం యూనిట్ హెడ్ మజూర్ బేగ్, ఆయన సతీమణి హీనా బేగ్‌లు ఈ విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మజూర్ బేగ్ మాట్లాడుతూ కాసీపూర్‌లో అత్యధికంగా ఆదివాసీ, హరిజనులు నివసిస్తున్నారన్నారు. వారి ఆర్థిక, సామాజిక పరిస్థితుల దృష్ట్యా కర్మాగారం ఆస్పత్రిలో మరిన్ని ఉచిత సేవలను అందించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఈ సేవలు ఉచితంగా రోగులకు అందుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ విభాగంకు చెందిన బిజయ్ కుమార్, డాక్టర్ అరవింద్ రాయ్ చౌదరి, సీఎంవో లోపముద్ర మిశ్రా పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 100 కిలోల గంజాయిని సదర్ పోలీసులు స్వాధీనం చేసుకొని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి గీతాంజలీ నాయక్ తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం కొందమాల్ జిల్లా బల్లిగుడా అటవీ ప్రాంతం నుంచి బరంపురం నగరానికి బొలేరో వాహనంలో అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు బరంపురం పోలీసులకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఆ మార్గంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానం గల వాహనంలో సోదాలు చేయగా 100 కిలోల గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. దీంతో బొలేరో వాహనంతో పాటు డ్రైవర్, మరో ముగ్గురిని అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో గజపతి జిల్లా మోనా బ్లాక్‌కి చెందిన దాశరథి గొమాంగో, ఈరోష్ సబత్, జయదేవ్ జెనా, సాముల్ సబత్‌లు ఉన్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

ఆదివాసీ సంస్కృతికి దర్పణం



విజ్ఞాన ఇంటర్‌నేషనల్ స్కూలు విద్యార్థుల పర్వ్ రథం



మా భగవతి మందిరం నుండి పర్వ్ మసాలాను తీసుకువస్తున్న ఎమ్మెల్యే తదితరులు



జంతువుల వేషధారణలో ఆదివాసీలు

జయపురం: కొరాపుట్ పర్వ్ ఉత్సవాలు ఆదివాసీ సంస్కృతులకు అద్దం పట్టినట్టు జరిగాయి. మున్సిపాలిటీలో మంగళవారం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, ఉపాధ్యక్షురాలు బి.సునీత, కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్, జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాఢీ, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర పాణిగ్రహి, సబ్‌కలెక్టర్ ప్రభాత్ కుమార్ పారిడ, సబ్‌డివిజన్ పోలీసు అధికారి హరిష్ బిసి పాల్గొన్నారు. వీరంతా ర్యాలీ యాత్ర నిర్వహించారు. యాత్రలో పలు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, డ్యాన్స్‌లు ప్రదర్శించారు. మా భగవతి మందిరం నుంచి ప్రారంభమైన ర్యాలీలో విద్యార్థులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.



ఆకర్షణీయంగా ఆదివాసీ డ్యాన్స్



ఢింసా నృత్యం చేస్తున్న విద్యార్థులు



పర్వ్ ర్యాలీలో ఆదివాసీ సంప్రదాయ నృత్యం



పర్వ్ ర్యాలీలో ఆదివాసీ వాయిద్య కారులు



ర్యాలీలో ఆకట్టుకున్న వేషధారులు



ఆదివాసీ నృత్యాలలో కదం తొక్కిన బాహిణీపతి

గజపతి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- అఖల భారత కిసాన్ మజ్దూర్ సభ డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ఆందోళన



విలేకరులతో మాట్లాడుతున్న కిసాన్ సభ కేంద్ర కమిటీ కార్యదర్శి బాలచంద్ర షడంగి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అఖిల భారత కిసాన్ సభ సభ్యులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంట నాశనం అయ్యిందని అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. అంతకు ముందు కొత్తబస్టాండు నుంచి కలెక్టరేట్ వరకూ ఏఐకేఎంఎస్ కేంద్ర కమిటీ కార్యదర్శి బాలచంద్ర షడంగి, గజపతి జిల్లా కిసాన్ సభ కార్యదర్శి కేదార్ సభ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. గజపతి జిల్లాలో భూమిలేని నిరుపేదలకు భూపట్టాలు మంజూరు చేయాలని, 2006 నుంచి అటవీప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకు భూమి హక్కుపట్టాలు ఇవ్వాలని, వారికి పీఎం ఆవాజ్ యోజనా లేదా బిజూ పక్కా ఇల్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే గజపతి జిల్లాలోని కృష్ణ, గజపతి, రాధా సాగారాల ఆయకట్టుకు సక్రమగా సాగునీరు అందేలా సాగునీటి పాయింట్లను బాగుచేయాలని, ఎంజీఎన్‌ఆర్‌జీ పథకంలో శ్రామికులకు 200 రోజుల పనిదినాలు, కనీస దినసరి వేతనం ఆరు వందల రూపాయలకు పెంచాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర కిసాన్ సభ నాయకులు బాలచంద్ర షడంగి కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆందోళనలో గంగాబడ



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన మహిళలు

సర్పంచు హరిబంధుకార్జి, మహిళా నాయకురాలు నియాపల్లి శోబోరో, సుంకా శోబోరో, సాంబ్రో శోబోరో, సీపీఎం (లిబరేషన్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస బెహరా పాల్గొన్నారు.

21న శాసన సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక

భువనేశ్వర్: రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ పదవికి ఈ నెల 21న ఎన్నిక జరగనుంది. ఇటీవలే జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఒడిశా అసెంబ్లీ శీతాకాల సమావేశాలు అదే రోజు నుంచి ప్రారంభం కానున్నాయి. నవంబరు 21వ తేదీ ఉదయం 9.30 గంటలకు డిప్యూటీ స్పీకరు ఎన్నిక నిర్వహించనున్నట్లు శాసన సభ కార్యదర్శి సభ సభ్యులందరికీ లేఖ పంపారు. ఈ నెల 8న రజనీకాంత్ సింగ్ రాజీనామా చేయడంతో శాసన సభ డిప్యూటీ స్పీకరు స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ఎన్నిక నిర్వహించనున్నారు. శాసన సభ శీతాకాల సమావేశాలు డిసెంబర్ నెల 30 వరకు కొనసాగుతాయి. ఈ వ్యవధిలో 30 పనిదినాలు ఉంటాయి. వీటిలో 23 అధికారిక వ్యవహారాల పని రోజులు, ప్రైవేట్ సభ్యుల వ్యవహారాలు (బిల్లులు, తీర్మానాలు) కోసం 6 రోజులు కేటాయించారు. ఈ నెల 27న రాస పూర్ణిమ, డిసెంబర్ 25న క్రిస్మస్ సందర్భంగా అసెంబ్లీ సెలవు దినాలు. నవంబర్ 25, 26 తేదీల్లో సభ సమావేశాలు జరగవు. వచ్చే ఏడాది జరగనున్న జమిలి ఎన్నికలకు ముందు ఇదే చివరి అసెంబ్లీ సమావేశాలు కావచ్చు.

జగన్నాథ ఆలయ ప్రాంగణంలో పాన్-గుట్కా నిషేధం

- జనవరి 1 నుంచి అమలు

భువనేశ్వర్: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి పూరీ జగన్నాథ ఆలయ ప్రాంగణంలో పాన్, గుట్కాపై నిషేధం విధించనున్నట్లు జగన్నాథ ఆలయం ప్రధాన పాలనాధికారి (సీఏఓ) రంజన్ కుమార్ దాస్ మంగళవారం తెలిపారు. ఆలయం లోపల పొగాకు సంబంధిత ఉత్పత్తుల వినియోగం, వినియోగంపై ప్రస్తుతం ఉన్న జరిమానాల గురించి ప్రస్తావిస్తూ ఆలయ నిర్వాహకులు ఈ విషయంలో ఛొత్తీషా నియోగులకు లేఖ రాశారు. ఇదివరకు జారీ చేసిన నిబంధనలు కట్టుదిట్టంగా అమలు కావడం లేదని, ఈ పరిస్థితి ఆలయ పవిత్రతకు విరుద్ధమని పేర్కొన్నారు. ఖాళీ గుట్కా ప్యాకెట్లు, కిళ్లీ ఉమ్ములు, ఇతర పాలిథీన్‌లు పడి ఉండడం అధికార యంత్రాంగం దృష్టికి వచ్చిందని విచారం వ్యక్తం చేశారు. ఆలయం లోపల కిళ్లీ, గుట్కా సేవించవద్దని ఆలయ నిర్వాహకులు తమ సిబ్బందిని, ఆలయ సేవకులు, భక్తులను అభ్యర్థించారు. పాన్, గుట్కాతో పాటు పాలిథీన్‌లో పువ్వులు, ప్రసాదం కూడా ఆలయం లోపలికి అనుమతించరు. దీనిపై అందరికీ అవగాహన కల్పిస్తామని, జనవరి 1 నుంచి నిషేధం అమల్లోకి వస్తుందని, ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని సీఏఓ వివరించారు. ఆలయం ఆవరణలో ఉమ్మివేయడం ఆలయ పవిత్రతకు ప్రమాదకరంగా మారినందున తమల పాకులు, గుట్కాతో సహా పొగాకు ఉత్పత్తులపై నిషేధం విధించాలని 2019 సంవత్సరంలో శ్రీ జగన్నాథ ఆలయ పాలక మండలి నిర్ణయించింది. ఇంత వరకు ఈ నిషేధం కట్టుదిట్టంగా అమలు కాకపోవడంతో తాజాగా మళ్లీ నడుం బిగించింది. ఆలయ ప్రాంగణం లోపల ఈ నిషేధిత వస్తువులు ఏవైనా ఉంటే సంబంధిత యాత్రికుడు, భక్తుడు, సేవాయత్, ఆలయ సిబ్బంది, అధికారులు ఎవరికైనా రూ.500 జరిమానా వడ్డిస్తారని స్పష్టం చేశారు.

వలస కార్మికుడి దుర్మరణం



ప్రమాద స్థలంలో పడిపోయిన జేసీబీ



శ్యామ్ మృతదేహం, (ఇన్‌సెట్లో) శ్యామ్ (ఫైల్)

రాయగడ: తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లాలో ఒక క్రసర్ కంపెనీలో జేసీబీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కాసీపూర్‌కు చెందిన వలస కార్మికుడు ప్రమాదవశాత్తు దుర్మరణం పాలయ్యాడు. మృతుడు కాసీపూర్ సమితి బంకంబ గ్రామానికి చెందిన శ్యామ్ మాఝి(24)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. గత కొన్నళ్లుగా శ్యామ్ ఉపాధి కోసం వరంగల్‌కు తోటి స్నేహితులతో వెళ్తున్నాడు. అక్కడ జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో ఎప్పటిలాగే శనివారం క్రసర్ పనుల్లో భాగంగా సుమారు 300 అడుగుల ఎత్తులో ఉన్నటువంటి కొండపై జేసీబీతో పనిచేస్తుండగా హఠాత్తుగా జేసీబీ కిందకి పడిపోయింది. దీంతో శ్యామ్ మృతి చెందాడు. ఆయన మరణ వార్త కుటుంబ సభ్యులకు క్రసర్ యాజమాన్యం తెలియజేసింది. మూడు నెలల క్రితమే శ్యామ్ వివాహం చేసుకుని, నెల రోజుల క్రితమే వరంగల్ వెళ్లినట్లు సమాచారం. ఆదివారం దీపావళి పండగ చేసుకునేందుకు తమ కుటుంబీకులు స్వగ్రామంలో ఆనందంగా ఉన్న సమయంలో శ్యామ్ మరణ వార్త శోక సంద్రంలో ముంచివేసింది. అనంతరం అతని భార్య, తల్లిదండ్రులు సోమవారం వరంగల్ వెళ్లి అంత్యక్రియలు జరిపించారు.

54 కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు



జిల్లా ఖరీఫ్ ధాన్యం సేకరణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ స్మృతి, ఎమ్మెల్యే నారాయణ రావు, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు, సివిల్ సప్లయి అధికారులు



జిల్లా స్థాయి ఖరీఫ్ ధాన్యం ప్రొక్యూర్‌మెంట్ సమావేశానికి విచ్చేసిన మిల్లర్లు, రైతులు, ఆర్‌ఎంసీఎస్ అధికారులు

పర్లాకిమిడి: జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు 54 కేంద్రాలు (మండీలు) తెరవనున్నట్లు జిల్లా సివిల్ సప్లయి అధికారి ప్రఫుల్లకుమార్ బెహరా తెలియజేశారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు జిల్లా స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ స్మృతి రంజన్ ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే కోడూరు నారాయణ రావు, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతి రావు, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి గుణ నిధి నాయక్, ఎంపీ ప్రతినిధి శాసనం లింగరాజు, అదనపు ఎస్పీ సునీల్ మహంతి, తదితరులు పాల్గొన్నారు. గుసాని సమితిలో 25, గుమ్మాలో 3, కాశీనగర్‌లో 16, రాయగఢలో 1, పర్లాకిమిడిలో 1, మోహనాలో 8 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం అమ్మకాలకు ఖరీఫ్‌లో 15,552 మంది రైతులు ముందస్తుగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఖరీఫ్‌లో ధాన్యం ఎఫ్.ఏ.క్యూ క్వింటాకు రూ.2183లు కాగా, గ్రేడ్-ఎ క్వాలిటీ ధాన్యం క్వింటాకు రూ. 2203లుగా మద్దతు ధరను నిర్ణయించారు.

సమితి కార్యాలయానికి తాళం



కార్యాలయం బయట నుంచి అధికారులకు సమాచారం ఇస్తున్న బీడీఓ ప్రభతి జోడియ

మల్కన్‌గిరి: స్థానిక సమితి కార్యాలయానికి సోమవారం బీజేపీ జిల్లా వైస్ చైర్మన్ నిరంజన్ హలధర్ తన అనుచరులతో వచ్చి తాళం వేశారు. సమితి కార్యాలయ అధికారి ప్రభతి జోడియా వచ్చినా ఆమెనూ లోపలకు వెళ్లనివ్వలేదు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందజేశారు. కేంద్రం అందిస్తున్న పథకాలు సకాలంలో గిరిజనులకు అందడం లేదని, సమితి సభ్యులకు సమాచారం ఇవ్వడం లేదని, కార్యక్రమాలకు బీజేడీ కార్యకర్తలకు తప్ప బీజేపీ వారికి సమాచారం ఇవ్వడం లేదని.. అందుకే సమితి కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపామని నిరంజన్ హల్‌ధర్ తెలిపారు. దీనిపై బీడీఓ ప్రభతి మాట్లాడుతూ సమస్యలు ఉంటే చర్చించుకోవాలి తప్పితే ఇలాంటి కార్యక్రమాలు చేయకూడదని హితవు పలికారు. ప్రతి సమితికి కేంద్రం అందిస్తున్న పథకాలు చేరుతున్నాయని స్పష్టం చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి సర్ది చెప్పడంతో వారు వెనుదిరిగారు.

70 యూనిట్ల రక్తం సేకరణ



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన పోలీసు అధికారి హరీష్



రక్తదానం చేస్తున్న దాతలు

జయపురం: అశుతోష్ పాఠి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం జయపురంలోని రక్త భాండార్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 70 యూనిట్ల రక్తం సేకరించారు. అశుతోష్ పాఠి జయంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జయపురం సబ్‌డివిజన్ పోలీసు అధికారి హరీష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన కూడా రక్తదానం చేసి మాట్లాడారు. రక్తదానం ఎంతో మంది ప్రాణాలు కాపాడుతుందని అన్నారు. కోవిడ్ మహమ్మారి తర్వాత రక్తదాన శిబిరాలు తగ్గిపోయాయని, స్వచ్ఛంద సంస్థల వారు ఎక్కువగా ఈ శిబిరాలు నిర్వహించాలని కోరారు. యువత అపోహలు వీడి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. లక్ష్యం మేరకు 70 యూనిట్ల రక్తం సేకరించామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జయపురం రక్తదాతల సంఘం కార్యదర్శి ప్రమోద్ రౌతో, స్వర్గీయ అశుతోష్ పాఠీ మెమోరియల్ ట్రస్టు నిర్వాహకులు ప్రఫుల్ల కుమార్ పాఠీ, సుభాష్ మహరాణ, అజయ సాహు తదితరులు పర్యవేక్షించారు. రక్త దాతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

క్లుప్తంగా

సమరోత్సాహంతో సామాజిక సాధికార యాత్ర

పోలాకి: నరసన్నపేటలో బుధవారం సమరోత్సాహంతో సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని, ప్రజలు విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, సీనియర్ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 1.30 గంటలకు మబగాం నుంచే బస్సు యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. మబగాం, కిల్లాం, ఈదులవలస, ఈదులవలస జంక్షన్, చల్లబంద జంక్షన్ దాటుకుని నరసన్నపేట పట్టణంలోకి బస్‌యాత్ర చేరుకుంటుందని చెప్పారు. దేశవానిపేట, పల్లిపేట జంక్షన్ మీదుగా వైఎస్సార్ కూడలికి చేరుకున్నాక అక్కడ దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సమావేశం ప్రారంభిస్తామని తెలిపారు. ప్రజలు, అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

గిరిజనుల్లో పులి భయం


జీడిపేట సమీపంలో గల జీడిరాయిల మెట్టపై ఉన్న పులి

టెక్కలి రూరల్: కొన్ని రోజులుగా జిల్లాలో సంచరిస్తున్న పెద్దపులి ఐదురోజుల కిందట టెక్కలి మండలం దమర రిజర్వ్ ఫారెస్ట్ కొండలోకి ప్రవేశించినట్లు అటవీ శాఖాధికారులు తెలిపారు. మంగళవారం మేఘవరం పంచాయతీ పరిధి జీడిపేట గ్రామ సమీపంలోని జీడిరాయల మెట్టపై నిలబడి ఉన్న పులిని అక్కడి ప్రజలు గుర్తించారు. అనంతరం అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న అటవీ శాఖాధికారులు పులిని గుర్తించి ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే కొండపై పులి ఉండడంతో గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారు. ఆ కొండకు ఆనుకుని భీంపురం, చిన్న భీంపురం, జక్కరపేట, జీడిపేట, కోదండపురం, సరియాపల్లి, డెప్పూరు, కొండమీద కొత్తూరు, దబ్బగుడ్డి, చిన్నకేదారి, పెద్దకేదారి గ్రామాలతో పాటు మెళియాపుట్టి మండలం పరిధిలో కొన్ని గ్రామాలు ఉన్నాయి.

కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం

పెద్దపులి జాడ కనిపించడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి సమయాల్లో బయటకు వెళ్లరాదని అటవీ శాఖాధికారులు ప్రజలను సూచించారు. పశువులను బయట ప్రాంతాల్లో కట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలానే పులి సంచరించే ప్రాంతంలో కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, టెక్కలి, మెళియాపుట్టి ప్రాంతాల్లో దండోరా వేయించనున్నట్లు అటవీ శాఖాధికారి తెలిపారు.

డిసెంబర్ నాటికి వంశధార రిజర్వాయర్ పూర్తి


వంశధార రిజర్వాయర్ హైలెవల్ కెనాల్‌ను పరిశీలిస్తున్న సీఈ ఇంజినీర్ల బృందం

హిరమండలం: వంశధార జలాశయం (రిజర్వాయర్) పనులు డిసెంబర్ ఆఖరుకు పూర్తవుతాయని ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ (సీఈ)ఎస్.సుగుణాకరరావు అన్నారు. ఇటీవల ఏఈ, జేఈలుగా ఎంపికైన యువ ఇంజినీర్లు సీఈ, ఎస్సీ కార్యాలయాల్లో వివిధ అంశాల్లో పనిచేస్తున్న సాంకేతిక బృందాలు మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా వంశధార రిజర్వాయర్, గొట్టా బ్యారేజీలను పరిశీలించారు. స్పిల్‌వే, హెడ్ రెగ్యులేటర్ బ్రిడ్జి, గట్టు నిర్మాణం, రాతి పేర్పు, హైలెవల్ కెనాల్‌తో పాటు రిజర్వాయర్‌లో నీటిని నింపేందుకు జరుగుతున్న ఎత్తిపోతల పథకం పనులు, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టులను గమనించారు. అనంతరం వారికి వంశధార ఎస్‌ఈ డోల తిరుమలరావు, ఈఈ ఎన్వీ రమణలు రిజర్వాయర్ అవశ్యకత, రిజర్వాయర్ నిర్మాణంలో ఎదురైన సమస్యలు, నదుల అనుసంధానానికి హైలెవల్ కెనాల్ ఉపయోగం, ఉద్దానం ప్రాంతానికి వెళ్లే తాగునీరు వంటి అంశాలపై వివరించారు. అనంతరం సీఈ విలేకరులతో మాట్లాడుతూ వంశధార రిజర్వాయర్‌లో 96 శాతం పనులు పూర్తయినట్లు తెలిపారు. మరో నాలుగు శాతం పనులు డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచుతామన్నారు. వానలు లేకపోవడంతో నాలుగైదు టీఎంసీలు మాత్రమే ఉందన్నారు. ఈ రబీ సీజన్‌కు నీరు ఇచ్చే అవకాశం లేదన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి మట్టం అడుగంటిపోయే దశలో ఉందన్నారు. లిఫ్ట్ ఇరిగేష్ పను లు జూన్ నాటికి పూర్తిచేస్తామన్నారు. దాని ద్వారా ఖరీఫ్ నాటికి పూర్తి స్థాయిలో నీరు అందజేస్తామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 12టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రిజర్వాయర్ నుంచి 1.2 టీఎంసీ నీరు ఉద్దానం ప్రాంత ప్రజలకు అందజేస్తామన్నారు. 2025 నాటికి పూర్తి స్థాయిలో 19 టీఎంసీల నీటిని నింపి జిల్లాలో రెండు పంటలు పండించడానికి సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీఈ స్వర్ణకుమార్, ఈఈ ప్రదీప్, సీతారాంనాయుడు, డీఈలు రవికాంత్, ధనుంజయరావు, సునీల్, గణేష్ సోమా ప్రతినిధి శ్రీనివాసరావు, వంశధార సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


మల్కన్‌గిరి: ర్యాలీ నిర్వహిస్తున్న శిశు మందిర్ విద్యార్థినులు

రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత తొలి ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులంతా క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.
– సాక్షి నెట్‌వర్క్


రాయగడ: విద్యార్థుల నృత్య ప్రదర్శనలు


రాయగడ: వక్తృత్వ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


బరంపురం: బాలికల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు


పర్లాకిమిడి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



మల్కన్‌గిరి: ట్రాఫిక్ పోలీసు వేషధారణలో విద్యార్థి


కొరాపుట్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ తదితరులు


రాయగడ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం


జయపురం: బాలల దినోత్సవంలో ప్రసంగిస్తున్న విద్యార్థి


బరంపురం: నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


జయపురం: కాంగ్రెస్ కార్యాలయంలో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉత్సవం.. ఉత్సాహం

బరంపురం : నగరంలో కాళీ పూజలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్థానిక కొడాసింగ్ జంక్షన్‌లో జరుగుతున్న పండాల్లో 20 అడుగుల కాళీ విగ్రహాన్ని స్థాపించి స్థానిక కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. స్థానిక మిలట్రీ లైన్, బెంకాళీ వీధిలో శ్యామ కాళీ, గేట్ బజార్ జంక్షన్‌లో, కొత్త బస్టాండ్, పెద్ద బజార్, రైల్వే స్టేషన్ రోడ్‌లో గల వెలసిన పూజ పండాల్లో కాళీ దేవత స్థాపించి హోమ, చండీ పఠనం, ప్రత్యేక సంధ్యా హారతితో వైభవోపేతంగా పూజలు జరుగుతున్నాయి.


కోడాసింగ్‌లో ప్రత్యేక పూజలు అందుకుంటున్న 20 అడుగుల కాళీ దేవత


కాళికా దేవి అవతారంలో భక్తుల దర్శనం కల్పిస్తున్న శ్యామ కాళి దేవత


స్టేషన్ రోడ్‌లో ప్రత్యేక పూజలు అందుకుంటున్న దండ కాళి దేవత


బెజ్జిపూర్ రోడ్‌లో ప్రత్యేక పూజలు అందుకుంటున్న కాళిక దేవత

డ్రైనేజీ వ్యవస్థ బాగు చేయాలని ఆందోళన


పర్లాకిమిడి బట్టగాడో వీధి వద్ద రాస్తారోకో ఆందోళనలో మహిళలు, మాజీ కౌన్సిలరు బెహెరా

పర్లాకిమిడి: స్థానిక కాలేజ్ రోడ్డు బట్టగాడో వీధి వద్ద డ్రైనేజి వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డు పైకి వస్తోందని 14, 15, 16 వవార్డు వాసులు బుధవారం ఉదయం ఆందోళన చేశారు. రాస్తారోకో నిర్వహించి బస్సుల రాకపోకలు అడ్డుకున్నారు. వార్డు కౌన్సిలర్లు జ్యోతిర్మయి దాస్, సూర్యజిత్ త్రిపాఠి, వి.రామారావు, బీజేడీ సీనియర్ నాయకులు బసంత్‌దాస్, రాష్ట్ర బీజేడీ సాధారణ కార్యదర్శి ప్రదీప్ నాయక్‌లు ఆందోళన చేస్తున్న వారికి మద్దతు తెలిపారు. దీంతో ఆర్‌అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీకాంత్ సామల్, ఆదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, పోలీసు ఐఐసీ ప్రశాంత్ భూపతి అక్కడకు వచ్చి ఆందోళనకారులను శాంతపరిచారు. పదిహేను రోజుల్లోగా సమస్య పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. దీంతో తిరిగి ట్రాఫిక్ పునరుద్ధరణ జరిగింది. ఆందోళనలో మాజీ కౌన్సిలరు బబులా బెహెరా, ఎన్ని వెంకటరమణ, ఇతర వార్డు మెంబర్లు పాల్గొన్నారు.


కౌన్సిలరు జ్యోతిర్మయి దాస్‌తో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీరేంద్ర కుమార్ దాస్, ఈఈ శ్రీకాంతసామల్, సబ్‌కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్, ఐఐసీ ప్రశాంత భూపతి

భువనేశ్వర్ మెట్రో ప్రాజెక్ట్ మొదటి దశకు

క్యాబినెట్ ఆమోదం

భువనేశ్వర్: భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. మొత్తం 12 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అధ్యక్షతన మంగళవారం ఈ సమావేశం జరిగింది. ఇందులో మెట్రో తొలి దశకు సంబంధించిన సవివరణ నివేదిక డీపీఆర్‌కు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

రూ. 5,929.38 కోట్ల వ్యయ ప్రణాళిక

త్రిశూలియా స్క్వేర్ నుంచి భువనేశ్వర్ విమానాశ్రయం వరకు మెట్రో రైలు రవాణా అందుబాటులోకి వస్తుంది. రూ. 5,929.38 కోట్లతో మెట్రో రైలు ప్రాజెక్టును చేపట్టనున్నారు. ప్రాజెక్టు పూర్తి వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. ప్రస్తుత ఏడాది అనుబంధ బడ్జెట్‌లో మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ. 210 కోట్లు కేటాయించారు. కొత్త సంవత్సరం 2024 జనవరి 1న ముఖ్యమంత్రి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు.

48 నెలల కాల పరిమితి

కంపెనీల చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వ పూర్తి యాజమాన్య సంస్థ భువనేశ్వర్ మెట్రో రైల్ కార్పొరేషన్ ఈ పనులు చేపడుతుంది. ఈ సంస్థ కార్యాచరణ ఆరంభమైంది. ఈ పనుల పర్యవేక్షణ కోసం రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ అధ్యక్షతన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. నిర్ధారిత కాల పరిమితిలో ఈ పనులు పూర్తి చేయించడం ఈ కమిటీ బాధ్యతగా పేర్కొన్నారు. త్వరలో ప్రారంభం కానున్న భువనేశ్వర్ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు 48 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యం నిర్ధారించారు.

బరంపురంలో రింగు రోడ్

ఈ ప్రాజెక్టు నిర్మాణంతో బరంపురం, ఛత్రపురం, గోపాలపూర్ మధ్య రాకపోకల సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. రింగు రోడ్డు నిర్మాణానికి రూ. 156.51 కోట్లు వెచ్చించేందుకు మంత్రి మంత్రి మండలి ఆమోదం లభించింది. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. రుషికుల్య నదిపై బ్యారేజి నిర్మాణానికి మంత్రి మండలి అంగీకారం తెలిపింది. గంజాం జిల్లా ధరాకోట్ మండలం జానవిల్లి గ్రామం ప్రాంతంలో బ్యారేజి నిర్మితం అవుతుంది. ఈ ప్రాజెక్టు వ్యయ ప్రణాళిక రూ. 86.54 కోట్లు. బరంపురంలో రింగ్ రోడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

నీటి సరఫరా

గంజాం జిల్లాలో 52.675 హెక్టార్ల విస్తీర్ణపు పంట పొలాలకు సాగు నీరు, బరంపురం నగర పాలక సంస్థ పరిధిలో నిత్యం 67.5 మిలియన్ లీటర్ల తాగు నీరు సరఫరా ప్రతిపాదన మంత్రి మండలి ఆమోదం పొందింది.

ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు హై కోర్టు జరిమానా

భువనేశ్వర్: బరాబటి-కటక్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీంకు హై కోర్టు జరిమానా విధించింది. ఆయనకు హై కోర్టు ఇలా జరిమానా విధించడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో మహ్మద్ మొకీం రాబటి-కటక్ నియోజక వర్గం నుంచి ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక చెల్లదని వేసిన కేసును హై కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ నియోజక వర్గం నుంచి పోటీ చేసి పరాజయం చవి చూసిన బిజూ జనతా దళ్ అభ్యర్థి దేబాశిష్ సామంత్రాయ్ హై కోర్టులో ఈ కేసు దాఖలు చేశారు. ఎన్నికల్లో మహ్మద్ మొకీం తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసినట్లు ఆయన ఆరోపించారు. ఈ కేసులో తన వాదన వినిపించడంలో ఎమ్మెల్యే విఫలం కావడంతో ఒడిశా హైకోర్టు రూ. 10,000 జరిమానా విధించింది. ఇదివరకు కూడా 2 సార్లు రూ. 10 వేలు చొప్పున జరిమానా విధించింది. తొలుత ఆగస్టు 4న వాదనలు పురస్కరించుకుని అఫిడవిట్ దాఖలు చేయడంలో విఫలమైనందుకు, తర్వాత అక్టోబర్ 13న కోర్టు నిర్ధారించిన తేదీ ప్రకారం తన డిఫెన్స్‌లో సాక్షులను హాజరు పరచడంలో విఫలమైనందుకు జరిమానా వేశారు.

బరాబటి-కటక్ నియోజక వర్గం సిటింగు ఎమ్మెల్యే మహ్మద్ మొకీం తన ఆస్తులు, అప్పుల గురించి సరైన వాస్తవాలను వెల్లడించలేదని పరాజిత బీజేడీ అభ్యర్థి దేబాశిష్ సామంత్రాయ్ ఆరోపించారు. 2019 సంవత్సరం జూలై 3న ఈ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై కోర్టు అదే సంవత్సరం నవంబర్ 22న విచారణ ప్రారంభించింది. ఈ నెల 13వ తేదీ విచారణకు మహ్మద్ మొకీం ప్రత్యక్షంగా హాజరు కానందున హై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసి జరిమానా విధించింది.

అనారోగ్య కారణాలతో ఆయన న్యాయస్థానంలో ప్రత్యక్షంగా హాజరు కాలేకపోయారని మొకీం తరఫు న్యాయవాది చేసిన అభ్యర్థనల్ని న్యాయస్థానం తోసి పుచ్చింది. కేసు తదుపరి విచారణ నవంబర్ 20కి వాయిదా వేస్తూ, జస్టిస్ ఎస్కే సాహు ఏకసభ్య ధర్మాసనం మొకీంకు రూ. 10,000 జరిమానా విధించాలని ఆదేశించింది.

పూరీ రైల్వే స్టేషన్ కోచింగు డిపోలో అగ్ని ప్రమాదం


పూరీ రైల్వే స్టేషను కోచింగు డిపోలో అగ్ని ప్రమాదం.

భువనేశ్వర్: పూరీ రైల్వే స్టేషన్ కోచింగ్ డిపోలో మంగళవారం అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో సిబ్బంది వెంటనే అగ్నిమాపక దళానికి సమాచారం అందించారు. ఈ బృందం సకాలంలో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


ఆరోగ్య కేంద్రం వద్ద రామ మృతదేహం

మల్కన్‌గిరి: కోరుకొండ సమితి నిలాకంబెరి పంచాయతీ సుర్లుకొండలో రామ పొడియమి(40) అనే వ్యక్తి మంగళవారం చెరువులో మునిగి మృతి చెందారు. నిలాకంబెరి గ్రామానికి చెందిన పొడియమి సోమవారం భార్యాపిల్లలతో కలిసి పొలానికి వెళ్లారు. భార్యాపిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చేయగా.. ఆయన మాత్రం తన సోదరుడు మైలాతో కలిసి చెరువు వద్దకు స్నానం చేద్దామని వెళ్లాడు. స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దీంతో మైలా కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. రాత్రంతా గ్రామస్తులు గాలించగా చిమ్టాపల్లి వద్ద ఉన్న కాలువలో అతని ఆచూకీ దొరికింది. వెంటనే బయటకు తీసి బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బలిమెట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు






క్షతగాత్రులు

రాయగడ: జిల్లాలోని చందిలి పోలీస్ స్టేషన్ పరిధిలో గల కర్లకొన ఘాటీ వద్ద మంగళవారం ఆటో బోల్తా పడి ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. రాయగడకు సమీపంలో గల జేకేపూర్ నుంచి ఒక ఆటోలో ఆరుగురు కళ్యాణసింగుపూర్‌కు మంగళవారం మధ్యాహ్నం బయల్దేరారు. కర్లకొన ఘాటీ వద్ద ఆటో బోల్తా పడింది. క్షతగాత్రుల్లో రంజిత పలక (32)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆవు ఎదురుగా రావడంతో ప్రమాదం జరిగింది.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

- లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

విజయనగరం అర్బన్: పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న వై.శంకరగిరినాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఆదేశాలు జారీచేశారు. పాఠశాల బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నట్టు డీఈఓ తెలిపారు. 610 జీవోపై జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన శంకరగిరినాయుడు తొలినుంచి వివాదస్పదంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ పార్టీతరఫున బహిరంగ ప్రచారం చేయడంతో విద్యాశాఖ అధికారులు మెమోజారీ చేశారు. ఎంఈఓ సంతకం ఫోర్జరీ చేసి రూ.50 వేలు మెడికల్ బిల్లు పెట్టారన్న వివాదం ఆయనపై నడుస్తోంది. గంట్యాడ నుంచి ఇటీవల పూసపాటిరేగ మండలానికి సర్దుబాటులో వచ్చి ఉపాధ్యాయ వృత్తికి అగౌరం తెస్తున్నారని, ఆయన ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నేటి నుంచి అండర్-14/17 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న 67వ స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్నట్లు అండర్-14/17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎ ఎల్‌వీ రమణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు 15న బొండపల్లి మండలంలోని గరుడబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18న భోగాపురం మండలంలోని రావాడ జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక, 21న నెల్లిమర్లలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపిక పోటీల్లో నిర్ణీత వయస్సు కలిగిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని, జిల్లా స్థాయిలో అర్హత సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

సంతాప పత్రం అందజేత



సంతాప పత్రాన్ని జశ్వంత్ నాయుడుకు అందజేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: ఏపీ శాసన సభ మాజీ సభ్యుడు తాడ్డి సన్యాసినాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలను స్మరిస్తూ ఏపీ శాసన సభ సంతాప పత్రాన్ని పంపించింది. దీనిని తహసీల్దార్ అరుణకుమారి సన్యాసినాయుడు కుటుంబసభ్యుడైన డాక్టర్ జశ్వంత్ నాయుడుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

వరి పంట పరిస్థితిని నివేదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి పంట పరిస్థితిని వివరించాలని వ్యవసాయాధికారులను ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సభ్యులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో వ్యవసాయాధికారి పూడి నిర్మల మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక సమచారాన్ని అందించామని తెలిపారు. దీంతో ఎంపీపీ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడారు. వర్షాలు చివరిలో ముఖం చాటేయడం వలన వరి బాగా దెబ్బతిందని, దీనిపై సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయాలన్నారు. తాము కూడా జిల్లా ప్రజాప్రతినిధులకు పరిస్థితులను వివరిస్తామన్నారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఏఓ చెప్పారు. డెంకాడ, మోపాడ పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.శివరామకృష్ణ, యోగితబాల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గుర్తించిన రోగులకు తగిన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కంటి రోగులకు కంటి ఆపరేషన్లు కూడా చేయించేందుకు పంపిస్తున్నామని వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కూరాకుల అనిత, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కనుల పండువగా..

ఉయ్యాలకంబాల

- అమ్మదర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఇరుముడిధారణ చేసిన పైడితల్లి దీక్షాధారులు



ఊయలలో అమ్మవారి ఉత్సవవిగ్రహంతో ఆశీనులైన సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్త కోటికి సిరులిచ్చే చిన్నారి పైడిమాంబ ఊయల ఊగుతూ భక్తులను ఉత్సాహపరిచింది. ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించారు. చదురుగుడి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాల చుట్టూ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మూడుమార్లు ప్రదక్షిణ చేశారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సమక్షంలో అమ్మవారిని ఉయ్యాలలో ఆశీనులను చేసి ఉత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు విశేష పూజలు చేశారు. ఉయ్యాల కంబాల అనంతరం సిరిమానుతో పాటు తెచ్చిన రాటకు మూడుసార్లు గొడ్డలి ఆనించి ఉయ్యాలను తీసివేశారు. దీంతో అమ్మవారి జాతరకు ముగింపు పలికినట్లేనని, బుధవారం వనంగుడి వద్ద చండీహోమం పూర్ణాహుతితో జాతర ముగుస్తుందని అర్చకులు తెలిపారు. ఉత్సవం పూర్తయిన తర్వాత అమ్మవారిని మేళతాళాలతో వనంగుడికి తీసుకువెళ్తారు. బుధవారం నుంచి అమ్మవారు వనంగుడిలో భక్తులకు ఆరు నెలల పాటు దర్శనమిస్తారు. కార్యక్రమానికి ముందు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి మాట్లాడుతూ నెలరోజుల జాతర మహోత్సవాలు ఈ నెల 14న బుధవారం వనంగుడిలో నిర్వహించే దీక్షా విరమణలతో పూర్తవుతాయని వివరించారు. సిరిమానోత్సవం రోజున అమ్మవారిని దర్శించలేని భక్తులు ఉయ్యాలకంబాల రోజున దర్శించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, పులిహోర, మజ్జిగ, ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మదర్శనానికి పోటెత్తిన భక్తులు

వేకువజామునుంచి అమ్మవారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, తాళ్లపూడి ధనుంజయ్, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, సాయి కిరణ్, శంబరి కృష్ణల ఆధ్వర్యంలో పూజలు సాగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 50వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. ఉదయం నుంచే క్యూలైన్లు కోట వరకు బారులు తీరాయి. మధ్యాహ్నం 2 గంటలవరకు భక్తుల తాకిడి కొనసాగింది. అమ్మవారికి వివిధ వేషధారణలతో మొక్కుబడులు చెల్లించారు.

వనంగుడిలో విశేష పూజలు

రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం అర్చకులు రవి ఆధ్వర్యంలో అమ్మవారికి, బాలాలయంలో చిన్నారి పైడితల్లికి, ఆలయ ఆవరణలో పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు జరిగాయి.

నేడు దీక్షాపరుల ర్యాలీ

బుధవారం వేకువజామున 6 గంటల నుంచి ఇరుముడి కట్టిన పైడితల్లి అమ్మవారి దీక్షాదారులు అమ్మవారి నామస్మరణతో చదురుగుడి నుంచి ఇరుముడినెత్తుకుని అమ్మవారి ఉత్సవవిగ్రహంతో వనంగుడికి బయలుదేరుతారు. వనంగుడి వద్ద నిర్వహంచే చండీహోమం , పూర్ణాహుతి కార్యక్రమాల్లో దీక్షాపరులు పాల్గొంటారు. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత దీక్షా విరమణలు చేస్తారు. దీంతో ఉత్సవం పూర్తవుతుంది.

సీఎం జగన్‌కు కళింగ కోమట్ల కృతజ్ఞతలు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కళింగ కోమటి సామాజిక వర్గం ప్రతినిధులు

చీపురుపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి'లో చేర్చినందుకు రుణపడి ఉంటామని ఆ సామాజిక వర్గం ప్రతినిధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను చీపురుపల్లి పట్టణంలో కలిసి సత్కరించి, ఆయన ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి కళింగ కోమటి సామాజిక వర్గం ఓసీ జాబితాలోనే ఉండేదని, దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదనలోకి వచ్చిందన్నారు. ఆయన మరణానంతరం ఎలాంటి పురోగతి లేకుండా పోయిందన్నారు. అయితే 2013లో కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి' జాబితాలో చేర్చాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు మాత్రమే వర్తించిందన్నారు. ఇదే విషయాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి'లో చేర్చుతూ జీవో విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ద్వారా తమ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఎంతో మందికి మేలు జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, ఎస్‌వీజీ .శ్రీనివాసరావు, కింతలి మధు, అందవరపు హరి, గోవింద, కింతలి శ్రీను, ఖండ్యాన వసంత్, సుంకరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టు తవ్వేసి రోడ్డు నిర్మాణం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



చెరువు గట్టు తవ్వేసి రోడ్డు వేసేందుకు చదును చేసిన దృశ్యం

లక్కవరపుకోట: ఆయన పెద్ద భూస్వామి. తన మామిడి తోటకు కారులో వెళ్లేందుకు తగిన రోడ్డు కావాలి. అయితే రోడ్డు వేసుకునేందుకు ఆవకాశం లేదు. దీంతో ఏకంగా చెరువు గట్టును తవ్వేసి రోడ్డు నిర్మాణం చేపట్టిన దురాక్రమణ పర్వం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లచ్చింపేట గ్రామ రెవెన్యూ పరిధిలో విశాఖపట్నానికి చెందిన అత్తిల వెంకటరమణకు సర్వే నంబర్ -82లో మామిడి తోట ఉంది. ఆ తోటకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. దీంతో ఆయన తన కారు వెళ్లేందుకు రహదారిని నిర్మించాలని నిర్ణయించి 81 సర్వే నంబర్‌లో గల ఎర్ర చెరువు గట్టును పూర్తిగా తవ్వేసి రోడ్డును ఏర్పాటు చేసేందుకు రాళ్లు పేర్చి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఆ చెరువు కిందనున్న ఆయకట్టు రైతులు గమనించి తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు వీర్రాజు, సన్యాసిరావులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు గట్టును అక్రమంగా తవ్వేసినట్లు గుర్తించారు. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుని సదరు వ్యక్తిపై పోలీస్‌కేసు నమోదు చేసేందుకు తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి సిఫారసు చేశారు.

మధుమేహ వ్యాధి పట్ల తస్మాత్...

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



సర్వజన ఆస్పత్రి వద్ద ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అనిలాసునందని తదితరులు

విజయనగరం ఫోర్ట్: మధుమేహ వ్యాధి జీవితంలోకి రాకుండా చూసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడం వల్ల మధుమేహ వ్యాధి బారిన ప్రజలు పడుతున్నారని అన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతి రోజు వ్యాయామం తీసుకోవడం ద్వారా మధుమేహ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని చెప్పారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుని సలహా మేరకు మందులు వాడాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని, వైద్యులు డాక్టర్ సుదర్శి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆదిత్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంతో కంటి సమస్యలు

విజయనగరం ఫోర్ట్: మధుమేహం నియంత్రణలో లేకపోతే కంటి సమస్యలు వస్తాయని వైష్ణవ్ ఐ కేర్ సెంటర్ వైద్యులు డాక్టర్ బాలి తనూజ తెలిపారు. స్థానిక వైష్ణవ్ ఐకేర్ సెంటర్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, మురళీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


చేతివృత్తుల పునరుద్ధరణ ఆనందదాయకం



చేతివృత్తుల శిక్షణకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ

జామి: అంతరించిపోతున్న చేతివృత్తుల పునరుద్ధరణ హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జామి మండలంలోని బలరాంపురం గ్రామంలో ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ స్మాల్‌స్కేల్ యూనిట్ (విశాఖపట్నం) వారి సౌజన్యంతో ప్రగతిశీల మహిళాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తిబడి చేతివృత్తుల శిక్షణాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ స్థానిక అధ్యక్షురాలు కొత్తపల్లి భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ కరోనా మహమ్మారి తరువాత ఆర్థిక స్వావలంబన, సాధికారత దిశలో కుదేలైపోయారన్నారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టి చేతివృత్తులను పునరుద్ధరించి ఆర్థికపరిపుష్టి కలిగించడం అభినందనీయమని ప్రశంసించారు. బలరాంపురంలో ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై ఎంవీఆర్ గ్రూప్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రవి, స్థానిక పెద్దలు పి.ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరినాగు అలజడి



ఎస్.కోట పట్టణంలోని ఇండియన్ ఆయిల్ బంక్ సమీపంలో రాత్రి 7.30 గంటల సమయంలో సుమారు 13 అడుగుల పొడవు ఉన్న గిరినాగు హల్‌చల్ చేసింది. దీనిని స్థానికులు గుర్తించి స్నేక్‌క్యాచర్ వానపల్లి రామలింగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాటిపూడి రిజర్వాయర్ అటవీప్రాంతంలో పామును విడిచిపెడతానని స్నేక్‌క్యాచర్ తెలిపాడు. – ఎస్.కోట

సర్వీసులు క్రమబద్ధీకరించండి



వినతులు అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజన సహకార సంస్థలో దశాబ్ద కాలంగా కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్నామని, సర్వీసుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావుకు విజ్ఞప్తి చేశారు. జీసీసీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.జానకీరావు నేతృత్వంలో విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో శంకరరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జి.గోపాలరావు, కార్యదర్శి బి.రవినాయక్, జాయింట్ సెక్రటరీ ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం



హరిప్రసాద్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

చీపురుపల్లి: రాష్ట్రస్థాయిలో జరిగిన సైక్లింగ్ పోటీల్లో చీపురుపల్లి పట్టణంలోని శ్రీ బాలాజీ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న వాల్లె హరిప్రసాద్ బంగారు పతకం సాధించాడు. దీంతో మంగళవారం ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంగారుపతకం సాధించిన హరిప్రసాద్‌ను కళాశాల యాజమాన్య ప్రతినిధులు మంత్రి గోవింద, యల్లంటి వేణు, అధ్యాపకులు అభినందించారు. ఇటీవల బాపట్లలో జరిగిన అండర్-19 సైక్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున హరిప్రసాద్ పాల్గొని చక్కని ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించాడు.

19 నుంచి 'పంచారామ' సర్వీసులు

- షెడ్యూల్ విడుదల చేసిన డీపీటీఓ అప్పలనారాయణ



విజయనగరం అర్బన్: కార్తీక మాసంలో శైవపుణ్య క్షేత్రాల దర్శనాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచారామ సర్వీసులు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రతి ఆదివారం ఉంటాయని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సర్వీసుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్తీక సోమవారం రోజున ఉత్తరాంధ్రాలోని ప్రధానమైన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కొమరలింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలు దర్శించినా పవిత్ర కాశీయానం చేసినట్లేనని భక్తుల నమ్మకం. ఈ నమ్మకమున్న భక్తులకు ప్రతి సోమవారం ఈ సేవలను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో కార్తీక మాసంలో ఆదివారం సర్వీసులను అందిస్తున్నామని తెలిపారు. తొలి సర్వీసును ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఈ సర్వీసు బస్సు బయలుదేరి ఐదు క్షేత్రాలను సందర్శించి సోమవారం అర్ధరాత్రికి బయలుదేరిన చోటుకు తిరిగి వస్తుందన్నారు. అలాగే ఈ నెల 26, వచ్చేనెల 3, 10వ తేదీలలో సర్వీసులు ఉంటాయి. ఒక్కొక్కరికీ అల్ట్రా డీలక్స్ సర్వీసుకు కేవలం రూ.1,900, సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.1,950 చార్జీ ఉంటుందని వివరించారు. టిక్కెట్‌ను 'ఏపీఎస్‌ఆర్‌టీసీఆన్‌లైన్.ఐఎన్' లాగిన్‌లో పొందవచ్చన్నారు. అదేవిధంగా దగ్గరలో ఉన్న డిపోకు వెళ్లి కూడా టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందని, పూర్తి వివరాల కోసం ఫోన్ 9959225620, 9494331213, 7382923683 నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

- స్టేట్ నోడల్ ఆఫీసర్ , రాష్ట్ర పరిశీలకుడు



మాట్లాడుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ సైలా కల్పన, రాష్ట్ర పరిశీలకుడు ఎన్ దేవిడ్‌రాజు

రామభద్రపురం: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని అభ్యసనాభివృద్ధి కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ సైలా కల్పన, రాష్ట్ర పరిశీలకుడు ఎన్.డేవిడ్‌రాజు అన్నారు. ఈ మేరకు 6,7,8 తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడంలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయుల తీసుకుంటున్న ప్రత్యేక సాధన పీరియడ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షించేలా స్థానిక ఉన్నత పాఠశాలలో బొబ్బిలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు ఇస్తున్న శిక్షణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక విద్యాసంస్కరణలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్రంలో 20 జిల్లాల్లో మాత్రమే స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని, విద్యార్థుల విద్యా సామర్థ్యం మెరుగు పడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందజేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోర్స్ కో ఆర్డినేటర్ బ్రహ్మాజీరావు,డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణరావు పాల్గొన్నారు.

డ్వాక్రా అవకతవకలపై మరో ఆర్పీ అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపుల్లో అక్రమాలకు పాల్పడిన మరో ఆర్పీ పొగిరి సంధ్యారాణిని మంగళవారం అరెస్టు చేశామని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెలియకుండా ఇటీవల వరకు ఆర్పీలుగా పనిచేసిన శాసపు ఉమాదేవి, పొగిరి సంధ్యారాణి నగదు స్వాహాచేసిన విషయంపై మెప్మా సీఓ దానాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఎ2 సంధ్యారాణి చేసిన అవకవతకలపై గ్రూపుల సభ్యులను విచారించగా రూ.13.30 లక్షల మేరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిందన్నారు. ఆమె అవకతవకలకు పాల్పడిన మొత్తంలో ఇప్పటి వరకు బ్యాంకులో రూ. 5.55 లక్షలు చెల్లించగా ఇంకా రూ. 7.75 లక్షలు కట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కేసులో ఎ1 ఉమాదేవిని ఇదివరకే అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అప్పారావు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గిడుతూరి అప్పారావు(46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్.కోట ఎస్సై లోవరాజు మంగళవారం చెప్పారు. అప్పారావు తాగుడుకు బానిస కావడం, స్థిరత్వం లేక పోవడంతో ఆయన భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అప్పారావు ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. ఈ విషయం గమనించిన తల్లి లక్ష్మి ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి పరిశీలించిన సమయంలో తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేశారని ఎస్సై వివరించారు.